క్లుప్తంగా

అన్నదానానికి విరాళం అందజేత


అర్చకుడికి నగదును అందజేస్తున్న శ్రీకాంత్

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి సత్తివానిపాలెంకు చెందిన వ్యాపారి బోడసింగి శ్రీకాంత్ రూ.10,116 విరాళం అందజేశారు. అర్చకులకు ఆ మొత్తాన్ని అందించిన ఆయన ఆలయంలో నిర్వహించే అన్నదానానికి వినియోగించాలని కోరారు.

1220వ రోజుకు 'ఉక్కు' దీక్షలు



దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. 1220వ రోజు, శనివారం దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ మాట్లాడుతూ దీర్ఘ కాలంగా ఉద్యమం కొనసాగుతున్నా, పాలకుల్లో కనీసం స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని ప్రకటించేవరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ కమిటీ వివరాలు వెల్లడించింది. 16వ తేదీన విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, వాస్తుపూజతో ఉత్సవాలు మొదలవుతాయన్నారు. 22వ తేదీన ఆరాధన, పారాయణం, నిత్య హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ, చక్రస్నానం తదితర ఘట్టాలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపిస్తారని తెలియజేశారు.

జాగ్రత్తలు పాటిస్తే అదుపులో మధుమేహం

అక్కిరెడ్డిపాలెం: మధుమేహంపై రోగులు అవగాహన కలిగి ఉండాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పటల్ కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ శ్రావణి తాన్న అన్నారు. జూన్ 12 నుంచి 18వ తేదీ వరకు జాతీయ మధుమేహ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆస్పత్రిలో శనివారం మధుమేహంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ల సలహా మేరకు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకుంటూ, తగిన ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేస్తూ అదుపులోకి ఉంచుకోవాలని సూచించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు ముగిశాయి. జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారికి జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, పాఠశాల సీఈవో కె.నిశాంత్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

తగ్గేదే..లే

వస్తువు ఏదైనా C\o గాజువాక


గాజువాక మెయిన్ రోడ్‌లో వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు


వస్త్ర దుకాణంలో కొనుగోలుదారుల సందడి

- వ్యాపార, వాణిజ్య రంగాల్లో అనూహ్య అభివృద్ధి
- రోజుకు రూ.10 కోట్ల వరకు లావాదేవీలు
- వినియోగదారులకు అన్నీ అందుబాటులో లభ్యం

గాజువాక : పారిశ్రామిక పట్టణంగా అభివృద్ధి చెందిన గాజువాక ఇప్పుడు వ్యాపార, వాణిజ్యరంగాల్లోనూ సత్తా చాటుకుంటూ తగ్గేదే.. లే అంటోంది. ఒకప్పుడు చిన్నచిన్న వస్తువులు మాత్రమే దొరికే ఈ ప్రాంతం ఇప్పుడు సకల వస్తు వేదికగా భాసిల్లుతోంది. అన్ని రంగాల్లోనూ నగరంతో పోటీ పడుతోంది. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా అవతరించి గ్రేటర్ విశాఖలో అతిపెద్ద జోన్‌గా నిలిచిన ఈ మహాపట్టణంలో నగరానికి దీటుగా అన్ని వస్తువులు మంచి నాణ్యతతో సరసమైన ధరలకు దొరుకుతుండడంతో వినియోగదారులు కూడా మరోవైపు చూడడంలేదు. సుమారు ఐదు లక్షల మంది జనాభాతో రాష్ట్రంలోనే తలసరి ఆదాయంలో మొదటి స్థానంలో ఉన్న గాజువాకలో అన్ని రకాల వ్యాపారాలు విస్తరిస్తున్నాయి.

ఒకప్పుడు ఎలాంటి వస్తువులు కొనుగోలు చేయాలన్నా ఇక్కడికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరానికి పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు గాజువాక పట్టణం పారిశ్రామికంగా రోజురోజుకూ అభివృద్ధి చెందుతుండడంతో అన్ని వస్తువులు ఇక్కడే లభ్యమవుతున్నాయి. పాతగాజువాక నుంచి కొత్త గాజువాక వరకు ఉన్న మెయిన్ రోడ్డు, బీసీ రోడ్డు, కణితి రోడ్డు, వ్యాపార, వాణిజ్య కూడళ్లుగా గుర్తింపు తెచ్చుకున్నాయి. వీటితో పాటు కూర్మన్నపాలెం ప్రాంతం కూడా మరో వ్యాపార ప్రాంతంగా గుర్తింపు పొందుతోంది. వివిధ రకాల వస్తువులు, ఉత్పత్తులు కొలువుదీరి కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వస్త్ర వ్యాపారులు దేశంలోని పలు నగరాలు, పట్టణాలనుంచి వివిధ మోడళ్ల వస్త్రాలను రప్పించి అందిస్తున్నారు. వివిధ సందర్భాలకనుగుణంగా ప్రత్యేక రాయితీలు ఇస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. రెడీమేడ్ దుస్తులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటం, నాణ్యమైనవి అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని పట్టణవాసులే కాకుండా పరిసర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికే వస్తుండటం, అన్ని ప్రాంతాల నుంచి రవాణా సదుపాయాలు ఉండడం ఇక్కడి మార్కెట్‌కు ఇంతటి గుర్తింపు వచ్చింది.

దుకాణాల కళకళ

బంగారం ధరలు నింగినంటుతున్నా గాజువాక ప్రాంతంలోని బంగారం దుకాణాలు నిత్యం కళకళలాడుతూ కనిపిస్తాయి. జాతిరాళ్ల ఆభరణాలు, పచ్చలు, కెంపులు, మగువలు మెచ్చే రీతిలో ఆర్డర్లపై ఇక్కడే తయారు చేసి ఇస్తున్నారు. ఇవే కాకుండా ఫుట్‌వేర్, ఫర్నిచర్ దుకాణాలకు భారీ మొత్తంలోనే వ్యాపారాలు సాగుతాయి. గృహోపకరణాలు, వాహనాలు, సెల్‌ఫోన్లు తదితర వ్యాపారాలు కూడా ఆశాజనకంగా సాగుతున్నాయి. సంప్రదాయ దుస్తులతో పాటు వెస్టర్న్ వేర్‌కు సంబంధించిన వివిధ మోడళ్ల దుస్తుల విక్రయాలకు సంబంధించి ఈ ప్రాంతంలో భారీ షోరూమ్‌లు అందుబాటులోకి వచ్చాయి. ద్విచక్ర వాహనాలు, కార్ల షోరూమ్‌లు కూడా ఇక్కడ విస్తృతంగానే నడుస్తున్నాయి. ఈ ప్రాంతంలోని షోరూమ్‌లు, దుకాణాల్లో రోజుకు రూ.10 కోట్ల వరకు లావాదేవీలు నడుస్తున్నట్టు అంచనా. పండుగ దినాల్లో ఈ వ్యాపారాలు మరింత అధిక మొత్తంలో సాగుతున్నాయి.

సిటీకి వెళ్లే అవసరమే లేదు



గాజువాకలో దొరకని వస్తువంటూ లేదు. ఏది కావాలంటే అది ఇక్కడే దొరుకుతోంది. దీంతో నగరానికి వెళ్లాల్సిన అవసరమే రావడంలేదు. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ యాక్టివిటీలు కూడా గాజువాకలో అందుబాటులోకి వస్తున్నాయి. గేమింగ్ జోన్‌లు కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఒకప్పటి గాజువాకను ఇప్పటి గాజువాకతో పోల్చి చూసుకుంటే అభివృద్ధి చెందిన వేగాన్ని చూసి సంతోషంగా ఉంటుంది.

– గౌతమ్‌రాజ్, గాజువాక

ఊహించలేనంత అభివృద్ధి



గాజువాక 20 ఏళ్లలో బాగా అభివృద్ధి చెందింది. గతంలో చిన్న పట్టణంగా ఉండేది. ఇప్పుడు మహానగరంగా అభివృద్ధి చెందింది. ఏ వస్తువు కావాలన్నా గాజువాకలోనే లభిస్తోంది. తక్కువ సమయంలో ఇంత అభివృద్ధిని ఊహించలేదు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం, ఇక్కడ ఉపాధి కోసం వచ్చినవారు ఇక్కడే స్థిరపడటంతో వేగంగా అభివృద్ధి చెందింది.

– గొలుకొండ నాగభూషణం, వుడా కాలనీ, గాజువాక

అన్ని షాపింగ్ మాల్స్ ఇక్కడే ఉన్నాయి



గాజువాకలో ఒకప్పుడు చిన్న చిన్న షాపులు ఉండేవి. ఇప్పుడు పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ఇక్కడే ఏర్పాటయ్యాయి. డీ మార్టు, వాల్ మార్టు, సీఎంఆర్ షాపింగ్ మాల్స్, ఐనాక్స్‌లు.. ఇలా అనేక సంస్థలు గాజువాకలో ఉన్నాయి. పది సంవత్సరాల క్రితంతో పోల్చితే మాకే ఆశ్చర్యం వేస్తుంది.

– సక్కా వరలక్ష్మి, గాజువాక

17న ముగ్గురమ్మ వార్ల ఆలయ వార్షిక వేడుక


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి, గ్రామ పెద్దలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కొలువైన గ్రామ దేవతలు కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 17న ఘనంగా నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోదండ రామాలయం వద్ద ముగ్గురమ్మవార్ల ఆలయ వార్షిక వేడుకల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లి అప్పలరెడ్డి, కొల్లి కుంచారావు, విరోతి వరహాలు, దూడ పాపారావు, గిడితూరి అప్పారావు, దండు అప్పారావు, పెట్లి అర్జున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగుకు త్వరలోనే మోక్షం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 72వ వార్డు ఆటోనగర్ వద్ద గల తోకాడలో డ్రైనేజీల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని జీవీఎంసీ అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో కాల్వలు సరిగ్గా లేక మురుగు రోడ్డు పైకి చేరి పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ జోన్–6 అధికారులు స్పందించారు. డ్రైనేజీల మరమ్మతు పనులకు అంచనా విలువలను తయారు చేశామని, పరిపాలనాపరమైన ఆమోదం లభించిన వెంటనే పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలియజేశారు.

సాక్షి ఎఫెక్ట్..

హోరు గాలి.. జోరు వాన


పెదగంట్యాడలో ఈదురు గాలులకు ఊగుతున్న చెట్లు


కణితి రోడ్‌లో నిలిచిపోయిన వర్షం నీరు

- ఈదురుగాలులకు కూలిన చెట్లు
- వర్షానికి రహదారులు, మైదానాలు జలమయం

గాజువాక/పెదగంట్యాడ: ఈదురు గాలులు గాజువాకలో బీభత్సం సృష్టించాయి. శివారు ప్రాంతాల్లో చెట్లు నేలకొరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది, శనివారం సాయంత్రం గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.

కణితి రోడ్‌లో నిలిచిన నీరు

వర్షం నీటితో గాజువాక కణితి రోడ్ జలమయమైంది. భారీ వర్షానికి కాలువలు పొంగాయి. కణితి రోడ్ విస్తరణ పనులు ప్రస్తుతం నిలిచిన నేపథ్యంలో వర్షం నీరు రోడ్డుపైకి పొంగడంతో జనం అవస్థలు పడాల్సి వచ్చింది. రెండు గంటల పాటు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వర్షం తగ్గిన తరువాత మున్సిపల్ సిబ్బంది ఔట్‌లెట్ వద్ద అడ్డంకులను తొలగించారు.

● పెదగంట్యాడ మండలంలో గంగవరం నుంచి యారాడ వెళ్లే రోడ్డులో ఓ చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. స్థానికులు చొరవ తీసుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును తొలగించడంతో పాదచారులు, వాహనచోదకులు సాఫీగా ప్రయాణాలు సాగించారు. చెట్టు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం .. వడ్లపూడిలోని సిద్దార్థనగర్ వద్ద ఒక చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న వడ్లపూడి విద్యుత్ సబ్ స్టేషన్ సిబ్బంది తెగిన విద్యుత్ తీగలను హుటాహుటిన యథాస్థితికి తీసుకొచ్చారు. రాత్రి ఏడు గంటల తరువాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



ఈదురు గాలులకు గంగవరం రోడ్డులో కూలిన చెట్టు, పెదగంట్యాడ పార్కులో నిలిచిన వర్షం నీరు

స్కూల్ బస్సుల తనిఖీ


బస్సులో తనిఖీ చేస్తున్న ఆర్టీవో అధికారి

గాజువాక : పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో గాజువాక ఆర్టీవో అధికారులు వివిధ పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. గాజువాక బీసీ రోడ్‌లోని కాకతీయ జంక్షన్ వద్ద నిర్వహించిన ఈ తనిఖీల్లో ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన బస్సుల పత్రాలను, అనుమతులు, బస్సు ఛాసీ, పొల్యూషన్ స్థాయి ఎలా ఉంది, బస్ కండిషన్, బ్రేకులు పని చేసే విధానాన్ని తనిఖీ చేశారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో బస్సు డ్రైవర్ల కంటి చూపు స్థితిగతులతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను కూడా నిర్వహించారు.

గురజాడ కళాక్షేత్రం టారిఫ్ భారీగా పెంపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని గురజాడ కళాక్షేత్రం టారిఫ్‌లను భారీగా పెంచారు. ఈ మేరకు టౌన్ అడ్మిన్ విభాగం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, యాజమాన్యం అధికారిక కార్యక్రమాల కోసం యాజమాన్యం సెక్టార్–9లో సెంట్రలైజ్డ్ ఏసీతో గురజాడ కళాక్షేత్రం నిర్మించింది. ప్రారంభం నుంచి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు రోజుకు నామమాత్రం రుసుం కింద రూ.1800 వసూలు చేసేవారు. ఇపుడు ఆ టారిఫ్‌ను ఒకేసారి జీఎస్టీ కాకుండా రూ.20 వేలకు పెంచారు. ఉద్యోగులకు పెళ్లి, రిసెప్షన్ కాకుండా ఇతర కార్యక్రమాలకు టారిఫ్‌ను రూ.30 వేలుగా నిర్ణయించారు. ఉద్యోగుల డిపెండెంట్ కానివారు, బయట వారికి టారిఫ్‌ను రూ.75 వేలుగా చేశారు. వాణిజ్య అవసరాల టారిఫ్‌ను రూ.లక్షా యాభై వేలు చేశారు. ఈ టారిఫ్ 2027 మార్చి 31 వరకు అమలులో ఉంటాయని, ఆ తర్వాత ప్రతీ ఏడాది 5 శాతం టారిఫ్ పెరుగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం


సీఐ ఎర్రంనాయుడుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థిని

అగనంపూడి: బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునే వయసులో జీవితాలను అంధకారం చేసుకోవద్దని దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణతో మెలిగి, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాల మార్గనిర్దేశం చేశారు. పోక్సో చట్టం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వాడకం, లైంగిక వేధింపులపై కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో మాదక ద్రవ్యాలు వందరోజుల్లో నిర్మూలించడం, నివారణ కోసం పెద్ద ఎత్తున కార్యక్రమాలు రూపొందించినట్లు చెప్పారు. మాదకద్రవ్యాల రవాణాలో విద్యార్థులే పాల్గొంటున్నారని, వీటి వల్ల చిన్నతనంలోనే వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిపోతోందన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

విద్యార్థులకు పోక్సో చట్టంపై సీఐ అవగాహన కల్పించారు. మైనర్లను, మహిళలను మానసికంగా, శారీరకంగా వేధించడం, లైంగిక దాడులకు పాల్పడడం వంటి చర్యల వల్ల అనేకమంది జైలు పాలవుతున్నారన్నారు. న్యాయస్థానం వారికి విధించే శిక్షలను వివరించారు. మైనర్ల ప్రేమ పేరుతో సాగించే చర్యల వల్ల ఇద్దరి జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ట్యాబ్‌లలో, సెల్‌ఫోన్లలో అశ్లీల చిత్రాలు వీక్షించి, పెడదోవ పట్టవద్దని హితవు పలికారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

పిల్లలతో ఎలా వ్యవహరించాలి, మెలగాలనే అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లల నడవడిక, ప్రవర్తన, ఆలోచనా ధోరణులను గమనించి వారు సరైన మార్గంలో నడిచేలా చూడాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, హెచ్ఎం ప్రకాశరావు, పీడీ మన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సత్వర సాయం అందించాలి


యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న పరంధామయ్య

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సత్వర సాయం అందించాలని యూనియన్ ఆఫ్ స్టీల్ ఎంప్లాయిస్ (యూజ్) అధ్యక్షుడు బి.కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య డిమాండ్ చేశారు. ఎల్ఎంఎం పార్కులో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం లేకుండా కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆదుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు సమయానికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందని, దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ ఈ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎస్.అమ్మన్న, కె.నీలకంఠేశ్వరరావు, ఆర్.చిన్నయ్య, ఎస్.శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

పౌరుల చేతిలో వజ్రాయుధం స.హ. చట్టం


మాట్లాడుతున్న రామ అప్పారావు

అగనంపూడి: సమాచార హక్కు చట్టం సామాన్య పౌరుల చేతిలో వజ్రాయుధం వంటిదని ఆర్టీఐ కార్యకర్త పట్టా రామ అప్పారావు అన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న, జరిగిన ప్రతీ విషయాన్ని, పాలనలో అవినీతిని బయటపెట్టే ఆయుధం ఈ చట్టమన్నారు. సమాచార హక్కు చట్టం 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చట్టం రూపొందించి రెండు దశాబ్దాలు దాటుతున్నా నేటికీ ప్రజల్లో అవగాహన లేకపోవడం, ప్రభుత్వాలు ఆ దిశలో చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. చట్టంపై అవగాహన ఉంటే పాలనలో లోపాలు, ప్రభుత్వ చట్టాల అమలులో లోపాలు, అవినీతిని బయట పెట్టే అవకాశం ఉందన్నారు. సమాజ హితం కోరే ప్రతీ ఒక్కరూ స.హ.చట్టం ద్వారా వివరాలు రాబట్టి, అవినీతిని బయటపెట్టాలని, పాలనలో లోపాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. చట్టంలోని వివిధ సెక్షన్లు, వాటి పరిధిని వివరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుడే సుశీలా గజేంద్రరావు, ఎం.మస్తాన్‌రెడ్డి, కొలిపాక అప్పారావు, బొండా ఈశ్వరరావు, దానబాల త్రిమూర్తులు, శరగడం రామారావు తదితరులు మాట్లాడారు.

గీత కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న గీత సహకులాల అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు

పెదగంట్యాడ: కల్లు గీత వృత్తినే నమ్ముకునే బతికే గీత కార్మికులకు మద్యం దుకాణాల వేలం పాటలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు కోరారు. స్థానిక సమతానగర్‌లోని సంఘం కార్యాలయంలో గీత సహకులాల నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కులాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని 30 నుంచి 40 శాతం రాయితీ ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులతో ప్రభుత్వం చర్చించి ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. కుల ధ్రువీకరణ ఆధారంగా తమకు చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, యలమంచిలి మంగరాజు, బి.పరదేశి, నెల్లి సాధూరావు, దుంగ దేవన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


తిరుమలేశునికి తోమాల సేవకు పుష్పాలను తీసుకువస్తున్న గోవింద మాలధారులు


దివ్యక్షేత్రంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్వికులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో రెండో రోజు భూదేవి, శ్రీదేవి సమేత తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చనల అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనాలు కల్పించారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు అకల్మషహోమం నిర్వహించారు. గరుడ ప్రతిష్ఠ, అధివాసత్రయ హోమం, లఘు పూర్ణాహుతి, నీరాజన, మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవ సంధి, గ్రామ బలిహరణ, ధ్వజారోహణ పూజలు జరిగాయి. అగ్నిప్రతిష్ఠ నవ కుంభారాధన చేశారు. ప్రధాన హోమం చేసి లఘు పూర్ణాహుతి సమర్పించారు. సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం అందజేశారు.